సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



బీసీలకు అండగా వైఎస్సార్‌ సీపీ
బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు.
8లో



బీచ్‌లో సందడి
మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు చాలా రోజుల తర్వాత ఆదివారం కళకళలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
8లో

రాట్నాలమ్మకు పూజలు
పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానానికి ఒక్కరోజు ఆదాయం రూ.64,562 సమకూరినట్టు ఈఓ ఎన్‌.సతీష్‌కుమార్‌ తెలిపారు.



న్యూస్‌రీల్‌

నారసింహో నమోనమః
సుందరగిరిపై ముగిసిన కల్యాణోత్సవాలు



పూజలందుకుంటున్న నారసింహుడు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న దత్తత ఆలయం ఐఎస్‌ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలు ఆరు రోజులపాటు ఉత్సవాలను స్మార్త ఆగమయుక్తంగా, పాంచాహ్నిక దీక్షతో ఆలయ పండితులు, అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి నారసింహుడిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు దేవస్థానం అన్నప్రసాదాన్ని అందజేసింది. సాయంత్రం ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం అనంతరం పవళింపు సేవలను వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మకు ప్రణామాలు



పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అమ్మవారి సన్నిధికి తరలివచ్చారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువైన పాటెమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఐజీ తనిఖీలు



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్‌, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్‌: ఏలూరులో ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 పరీక్షా కేంద్రాలను ఆదివారం ఏలూరు రేంజ్‌ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. సెయింట్‌ థెరిస్సా ఇంటర్‌ క్యాంపస్‌లో కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సీఆర్‌ఆర్‌ విద్యాసంస్థల్లో కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తనిఖీ చేసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగరంలో ట్రాఫిక్‌ సమస్యలు ఏర్పడకుండా పోలీస్‌ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, అధికారులు ఉన్నారు.

ఏలూరు జిల్లాలో 4 కేంద్రాల్లో టెట్‌ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 4 కేంద్రాల్లో ఏపీ టెట్‌ పరీక్షలకు ఏర్పాట్లు చేశామని డీఈఓ ఎస్‌.అబ్రహం ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 9 వరకు ఉదయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. దుగ్గిరాలలోని ఏలూరు కాలేజ్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ, వట్లూరులో సీఆర్‌ఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్‌, ఆగిరిపల్లి మండలం పోతవరపాడు ఎస్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌లో అభ్యర్థి పేరు, తండ్రి పేరులో, జెండర్‌ తదితర మార్పులేమైనా ఉంటే పరీక్షా కేంద్రంలో మార్పు చేస్తారన్నారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్ష రాయడానికి ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం లేదా డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులను సహాయకులుగా నియమిస్తామన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌, గుర్తింపు ఐడీలతో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

టికెట్‌ ప్రకంపనలు

అసంతృప్తి జ్వాలలు
- ఉండిలో పట్టువీడని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి
- తణుకులో అనుచరులతో సమావేశమైన జనసేన ఇన్‌చార్జి విడివాడ
- రెండు నియోజకవర్గాల్లో రాజుకుంటున్న అసమ్మతి సెగలు
- స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉంటామని ప్రకటన
- ఉండిలో బుజ్జగింపులకు వచ్చిన పరిశీలకుడికి చేదు అనుభవం
- తణుకులో టీడీపీ ఇన్‌చార్జి ఆరిమిల్లిని గుమ్మం తొక్కద్దని విడివాడ హెచ్చరిక



ఆకివీడులో పరిశీలకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు



తణుకులో అనుచరులతో సమాలోచనలు చేస్తున్న జనసేన ఇన్‌చార్జి విడివాడ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లాలో టికెట్‌ ప్రకంపనలు మొదలయ్యాయి. నమ్మక ద్రోహం చేశారని ఒకరు, కోట్లు ఖర్చు పెట్టించి గొంతు కోశారని మరోనేత తీవ్ర స్థాయిలో అసమ్మతి గళం విప్పడంతో ఉండి, తణుకు నియోజకవర్గాల్లో పొలిటికల్‌ హీట్‌ పెరిగింది. టికెట్లు ఆశించి భంగపడిన ఇద్దరు ఆశావహులు కూడా అనుచరులతో సమావేశమై స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉంటామని ప్రకటించి టీడీపీ, జనసేనలకు అల్టిమేటం ఇవ్వడంతో రెండు నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు, పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఉండిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, తణుకులో జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు అసమ్మతి స్వరం హెచ్చుస్థాయిలో వినిపించడం చర్చగా మారింది. టీడీపీ, జనసేన తొలి జాబితా ప్రకటించిన నేపథ్యంలో టికెట్‌ రాక భంగపడిన నేతలు విరుచుకుపడుతున్నారు.

ఉండిలో వేరు కుంపట్లు
ఉండి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు టికెట్‌ బలంగా ఆశించి ఐదేళ్లుగా పార్టీ ఎమ్మెల్యేతో కలిసి కొంతకాలం, విడిపోయి సొంతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుతో సహా అందరూ టికెట్‌ ఇస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో నియోజకవర్గమంతా విస్తృతంగా పర్యటించడంతో పాటు సొంత స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించి జనాల్లో ఉన్నారు. వరుసగా 2009, 2014లో ఉండి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల సమయంలో నరసాపురం పార్లమెంట్‌ సీటుకు మంచి అభ్యర్థిని చూడమంటే వేటుకూరి శివరామరాజు తన అనుచరుడిగా తిరిగే మంతెన రామరాజును చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి టికెట్‌ ఇస్తే గెలుపించుకుంటామని స్పష్టం చేశారు. దీంతో సరైన విద్యార్హత లేని వ్యక్తిని పార్లమెంట్‌కు ఎలా పంపిస్తామని చెప్పిన క్రమంలో వేటుకూరి శివరామరాజు నరసాపురం నుంచి ఎంపీగా, మంతెన రామరాజు ఉండి ఎమ్మెల్యేగా పోటీ చేయగా వేటుకూరి ఎంపీగా ఓడిపోయి, మంతెన ఎమ్మెల్యేగా గెలిచారు. తదనంతర పరిణామాల్లో వేటుకూరి కార్యాలయంలోనే ఉండి నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని నిర్వహించే ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో వేరు కుంపట్లు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. 2019లో రామరాజు అభ్యర్థిత్వం ఖరారైనప్పుడే ఒక్క పర్యాయం మాత్రమేనని పార్టీ వద్ద మంతెనతోనూ ఒప్పందం జరిగిందని ఇప్పుడు మళ్లీ టికెట్‌ శివరామరాజుకు నిరాకరించి మంతెనకే ఇవ్వడంపై వేటుకూరి వర్గం మండిపడుతుంది.

పరిశీలకుడికి చుక్కెదురు
తొలి జాబితాలో మొండిచేయి చూపడంతో ఆదివారం అనుచరులతో శివరామరాజు సమావేశమయ్యారు. అక్కడికి టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కొత్త నాగేంద్రకుమార్‌వచ్చి వేటుకూరికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండటంతో కేడర్‌ తిరగబడి ఘెరావ్‌ చేసి గందరగోళం సృష్టించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండు రోజుల్లో అనుచరులందరి అభీష్టం మేరకు ఎన్నికల్లో పోటీ చేస్తానని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా అయినా తప్పనిసరిగా పోటీలో ఉంటానని శివరామరాజు ప్రకటించడంతో నియోజకవర్గంలో పొలిటికల్‌ హీట్‌ పెరిగింది.

ఆరిమిల్లికి తీవ్ర పరాభవం
తణుకు టికెట్‌ ఆశించి భంగపడిన జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు తీవ్ర స్థాయిలో పార్టీపై విరుచుకుపడుతున్నారు. శనివారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు సర్దిచెప్పడానికి ప్రయత్నం చేయగా తాను తప్పనిసరిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, నమ్మించి పార్టీ గొంతు కోసిందంటూ విడివాడ వాపోయారు. ఆదివారం ఉదయం టీడీపీ సీటు దక్కించుకున్న ఆరిమిల్లి రాధాకృష్ణ, విడివాడ నివాసానికి వచ్చి కలిసేందుకు ప్రయత్నించగా 'నా గుమ్మం తొక్కడానికి వీల్లేదు వెళ్లిపో నీ మీద పోటీ చేసేది నేనే.. ఇంకోసారి ఇంటికి రావద్దు' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దీంతో రాధాకృష్ణ, టీడీపీ నేతలు ఖంగుతిన్నారు. 2019 నుంచి విడివాడ జనసేనలో టికెట్‌ ఆశించి కోట్లు ఖర్చు చేసి క్రియాశీలకంగా పనిచేశారు. 2019లో చివరి నిమిషంలో జనసేన టికెట్‌ను విడివాడకు బదులు తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన పసుపులేటి వెంకట రామారావుకు టికెట్‌ కేటాయించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం పసుపులేటి జనసేనకు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అప్పుడు కూడా విడివాడ జనసేనలోనే కొనసాగి పార్టీ ప్రతి కార్యక్రమం నిర్వహించారు. తాజాగా కొద్ది నెలల క్రితం పవన్‌ కళ్యాణ్‌ తణుకులో సమావేశం నిర్వహించి విడివాడను విస్మరించి పార్టీలోకి వచ్చి, పోయేవాళ్లకి టికెట్‌ ఇచ్చి తప్పు చేయగా, ఈసారి రామచంద్రరావే పోటీలో ఉంటారని సంకేతాలు ఇచ్చారు. దీంతో టికెట్‌ తనదేనన్న ధీమాతో విడివాడ సీరియస్‌గా పనిచేసి జనసేన అధినేత చేతిలో రెండోసారి మోసపోయారు. ఆదివారం అనుచరులతో సమావేశమై ప్రతిసారి టికెట్‌ విషయంలో మోసం చేస్తూనే ఉన్నారని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తాడోపేడో తేల్చుకుంటానని ప్రకటించడం చర్చనీయాంశమైంది.

ప్రశాంతంగా గ్రూప్‌–2 పరీక్షలు



పరీక్షల తీరును పరిశీలిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి



రూమ్‌ నంబర్‌ సరిచూసుకుంటున్న అభ్యర్థులు

భీమవరం: జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 ప్రిలిమినరీ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.రామసుందర్‌ రెడ్డి తెలిపారు. జిల్లాలోని 37 కేంద్రాల్లో 14,546 మంది అభ్యర్థులకు 12,336 మంది హాజరయ్యారని, 84.80 హాజరు శాతం నమోదైందన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటుచేసి పక్కాగా పర్యవేక్షించామన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, ఏపీపీఎస్సీ సెక్షన్‌ అధికారి జె.జయంతి, ఏఎస్‌ఓ ఎ.నాగలక్ష్మి కలెక్టరేట్‌ పరిపాలనా అధికారి పీహెచ్‌జీఆర్‌ పాపారావు, పర్యవేక్షకులు టీఎల్‌ఎస్‌ఎస్‌ ప్రసాద్‌ పరీక్షలను పకడ్బందీగా పర్యవేక్షించారు. భీమవరం విష్ణు కాలేజీ కేంద్రంలో పరీక్షల నిర్వహణ తీరును జేసీ తనిఖీ చేశారు. పరీక్ష పేపర్లు స్ట్రాంగ్‌రూమ్‌కు చేరే వరకూ వాహనాలకు పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ముందుగా కమాండ్‌ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. అలాగే జిల్లా ఎస్పీ వి.అజిత పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

జనసేనకి దారేది?

- పేరుకే 'పశ్చిమ'లో పార్టీకి పట్టు
- ఒక్క సీటూ ప్రకటించని జనసేనాని
- భీమవరం నుంచి పోటీపైనా స్పష్టత కరువు
- తణుకులో పార్టీ నాయకుడికి మొండిచేయి
- అయోమయంలో పార్టీ కేడర్‌
- సొంత సామాజికవర్గం నుంచి వ్యతిరేకత



సాక్షి, భీమవరం: జనసేన పార్టీ పశ్చిమగోదావరి జిల్లాలో సార్వత్రిక సమరానికి ముందే తేలిపోయింది. తొలి జాబితాలో జిల్లా నుంచి ఒక్క సీటు కూడా పవన్‌కళ్యాణ్‌ ప్రకటించకపోవడం ఇప్పుడు హాట్‌ టాఫిక్‌గా మారింది. తణుకులో సొంత పార్టీ నాయకునికి మొండిచేయి చూపించిన పవన్‌కళ్యాణ్‌ భీమవరం నుంచి తన పోటీపై స్పష్టత ఇవ్వకపోవడంతో అధినేత వైఖరి అర్థంకాక పార్టీ కేడర్‌ అయోమయంలో ఉన్నారు. సొంత సామాజికవర్గం నాయకులు పవన్‌ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు.

అయోమయంలో కేడర్‌
పవన్‌ కళ్యాణ్‌ సొంత జిల్లా కావడం, సొంత సామాజికవర్గం ప్రాబల్యం ఉండటంతో పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన పార్టీకి మంచి పట్టుంటుందని ఆ పార్టీ నాయకుల అభిప్రాయం. ఆ నమ్మకంతోనే గత సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్‌, నరసాపురం పార్లమెంట్‌ అభ్యర్థిగా ఆయన సోదరుడు నాగబాబు పోటీ చేశారు. కాగా ఫ్యాన్‌ గాలి హోరులో ఇద్దరికీ ఘోర పరాజయం తప్పలేదు. త్వరలో జరుగనున్న ఎన్నికల కోసం టీడీపీతో జనసేన జతకట్టిన నేపథ్యంలో స్థానిక పరిస్థితుల దృష్ట్యా అత్యధిక స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ప్రచారం ముమ్మరంగా జరిగింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను పొత్తులో భాగంగా అత్యధిక స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులే పోటీలో ఉంటారని భావించారు. కాగా శనివారం విడుదలైన తొలి జాబితాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మిత్రపక్ష టీడీపీ అధినేత చంద్రబాబు నాలుగు నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులనే ప్రకటించగా భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలు మిగిలి ఉన్నాయి. అయితే జనసేన పార్టీ నుంచి పవన్‌కళ్యాణ్‌ ఒక్క పేరు ప్రకటించకపోవడం గమనార్హం. వారాహి యాత్ర సందర్భంగా తణుకు నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా విడివాడ రామచంద్రరావు పోటీ చేస్తారని ప్రకటించిన పవన్‌ ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరలా పవన్‌ భీమవరం నుంచే పోటీ చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఆ స్థానంపైనా స్పష్టత ఇవ్వకపోవడంతో పార్టీ కేడర్‌ అయోమయానికి గురవుతున్నారు. బీజేపీ కూడా కలిస్తే మిగిలిన మూడు నియోజకవర్గాల్లో ఎన్నిచోట్ల జనసేన పార్టీ పోటీ చేస్తుందనేది ఇప్పుడు ప్రశ్నార్థంగా మారింది.

దుమ్మెత్తిపోస్తున్న సొంత సామాజికవర్గ నేతలు
టీడీపీతో పొత్తులో భాగంగా కేవలం 24 స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేస్తుండటం పట్ల పవన్‌ తీరుపై సొంత సామాజికవర్గం నేతలే దుమ్మెత్తి పోస్తున్నారు. జనసేన బలం ఆ మాత్రమేనా, పార్టీ ప్రజల్లో అంత బలహీనంగా ఉందా అంటూ మండిపడుతున్నారు. టీడీపీ సీట్ల పంపకం చేయడం, జనసేన పార్టీ చేయి చాసి తీసుకోవడం ఏంటని మాజీ ఎంపీ హరిరామజోగయ్య లాంటి సీనియర్‌ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. రెండున్నరేళ్ల తమ అధినేతను ముఖ్యమంత్రిగా చూడాలన్న జనసేన కేడర్‌ కోరికను కేవలం 24 స్థానాలతో పవన్‌కళ్యాణ్‌ ఏ విధంగా నెరవేరుస్తారని, రాష్ట్ర ప్రయోజనాలను ఎలా కాపాడగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ పల్లకి మోసేందుకు పవన్‌ సొంత సామాజికవర్గాన్ని వాడుకుంటున్నారని సోషల్‌ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌

భీమవరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా యువత ముందుకు రావాలని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. భీమవరంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు ఆదివారం శ్రీనివాస్‌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం యువత పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. యువత సినీ వ్యామోహం, కుల అభిమానం పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. తాను 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి ఇప్పటివరకు భీమవరంలో ల్యాండ్‌మార్క్‌గా అభివృద్ధి పనులు చేశానన్నారు. ఆనాడు 82 ఎకరాల భూమిని సేకరించడంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. 126 ఎకరాల భూమిని సేకరించి 60 ఎకరాల్లో దివంగత వైఎస్సార్‌ సహకారంతో రూ.9 కోట్ల నిధులతో భారీ సమ్మర్‌ స్టోరేజ్‌ ట్యాంకును నిర్మించామన్నారు. దీని ద్వారా పట్టణంలో రోజుకు సుమారు 2.70 కోట్ల లీటర్ల వరకు తాగునీరు సరఫరా చేయగలుగుతున్నామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై అప్రోచ్‌ రోడ్ల నిమిత్తం రూ.36 కోట్లను మంజూరు చేయించామన్నారు. గత టీడీపీ పాలనలో మంచినీటి చెరువు తవ్వకానికి రైతుల నుంచి అప్పటి ఎమ్మెల్యే భూములు సేకరించి ఆయన పేరునే రిజిస్ట్రేషన్‌ చేయించుకుని తాగునీటి పథకాన్ని నిలిపివేశారని ఆరోపించారు. తాను రెండోసారి ఎమ్మెల్యే అయిన వెంటనే శాశ్వత ప్రాతిపదికన నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టానని చెప్పారు.

రూ.60 కోట్లతో ఇంటింటా తాగునీరు
భీమవరం, వీరవాసరం మండలాల్లో అన్ని గ్రామాలకు ఇంటింటికీ తాగునీరు అందించేలా జలజీవన్‌ మిషన్‌ పథకంలో రూ.60 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా తీసుకువచ్చామని గ్రంధి శ్రీనివాస్‌ తెలిపారు. రాష్ట్రంలో సీఎం జగన్‌ను, నియోజకవర్గంలో తనను ప్రజలు పూర్తిగా ఆదరిస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో గెల్లు సంజీవరాజు, మల్లుల వెంకటేశ్వరరావు, దొడ్డిపట్ల హనుమంతరావు, చలప శ్రీను, రేవూరి వెంకటేశ్వరరావు, పేరిచర్ల బాలాజీ, కూనపురెడ్డి నాని, పట్నాల సతీష్‌, యోహాన్‌, ఈడ నాని, ఏలేటి నరేంద్ర, జడ్డు శ్రీను, షేక్‌ ఇస్మాయిల్‌ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఏఎస్‌ రాజు, వన్‌టౌన్‌ జేసీఎస్‌ కన్వీనర్‌ నల్ల రాంబాబు, గాదిరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ సెలెక్షన్స్‌
తణుకు టౌన్‌: మండపాకలోని అంబేడ్కర్‌ గ్రౌండ్‌లో ఈనెల 27న ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్‌ కబడ్డీ పురుషుల జట్టు సెలెక్షన్స్‌ నిర్వహించనున్నట్టు అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు కౌరు శ్రీను, వై.శ్రీకాంత్‌ తెలిపారు. వివరాలకు సెల్‌ 96424 96117, 94913 33906లో సంప్రదించాలని వారు కోరారు.

'విశ్వకర్మ' శిక్షణతో ఉపాధి



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న మహిళలు

ఉండి: వృత్తి శిక్షణ ఉపాధి అవకాశాలకు అండగా ఉంటుందని అధికారులు అన్నారు. ఆదివారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో పీఎం విశ్వకర్మ యోజనపై ఒక్కరోజు సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా హస్తకళలు, టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 180 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్‌ మేనేజర్‌ మంగపతి, బీసీ కార్పొరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ పుష్పలత, లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ నాగేంద్రప్రసాద్‌, సీఎస్‌సీ మేనేజర్‌ రాజీవ్‌, డీఎల్‌పీఓ బాలాజీ, ఐటీఐ జిల్లా కన్వీనర్‌ వి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీకి జనసేన పార్టీ హోల్‌సేల్‌గా తాకట్టు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పొత్తు పేరుతో జనసేన పార్టీని చంద్రబాబుకు హోల్‌సేల్‌గా తాకట్టు పెట్టి జనసేన అధినేత పవన్ కల్యాణ్ చారిత్రక తప్పిదం చేశారని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చే 25 సీట్లు తీసుకోవడానికి మేం ముష్టివాళ్లమా అంటూ వివిధ సభల్లో పవన్ మాట్లాడారని, నేడు చంద్రబాబు విదిలించిన 24 అసెంబ్లీ సీట్లు, మూడు లోక్‌సభ స్థానాలు తీసుకుని పవన్ మురిసిపోవడంపై జనసేన శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యాయన్నారు. ఇది జనసేనా లేకా తెలుగుసేనా అని ప్రశ్నించారు. పవన్ 24 సీట్లుతోనే ముఖ్యమంత్రి అవుతారా? తన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, టీడీపీ, జనసేన పార్టీకి ఉన్న బలంతో పోలిస్తే వైఎస్సార్ సీపీకే బలం చాలా ఎక్కువ అన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రజలు రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర నాయకులు బీర సునీలబాబు, బి.సందీప్, రోహిత్, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

బీసీలకు అండగా వైఎస్సార్ సీపీ

- వైఎస్సార్ సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల
- అత్తిలిలో కుల సంఘాల ప్రతినిధులతో సమావేశాలు



అత్తిలిలో కుల సంఘాల ప్రతినిధులతో గూడూరి ఉమాబాల

అత్తిలి: బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె అత్తిలి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బీసీ, ఎస్సీ సంఘాల పెద్దలను కలుసుకున్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థినిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళనైన తనకు సీటు కేటాయించారన్నారు. గతంలో ఈ స్థానం నుంచి అగ్రకులస్తులే ఎంపీగా పోటీచేసేవారని, అయితే బీసీ సామాజిక ఓటర్లు ఉన్న నరసాపురం పార్లమెంట్ స్థానాన్ని తనకు కేటాయించడం బీసీలకు దక్కిన గౌరవమన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావును, అదే సామాజికవర్గానికి చెందిన తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, నియోజకవర్గ పరిశీలకుడు జక్కా సత్యనాగేంద్రప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పొట్ల సురేష్, చింతపల్లి గురుప్రసాద్, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్‌కుమార్, కంకటాల సతీష్, కసిరెడ్డి బాలాజీ, గుబ్బల ఆంజనేయులు, రంభ రాంబాబు, కందుల సత్యనారాయణ, కసగాని అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు

ఉండి: ఆల్ ఇండియా బీసీ ప్రజావెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉండికి చెందిన చిప్పాడ చంద్రశేఖర్ నియమితులయ్యారని అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు చెప్పారు. ఆదివారం ఉండిలో నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖరరావుకు నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి రాజకీయ పార్టీలన్నీ చర్యలు తీసుకోవాలని, బీసీ సంక్షేమ ఫలాలు వారికే అందేలా శ్రద్ధ తీసుకోవాలని, అలాగే బీసీలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. రూ.5 నుంచి రూ.10 లక్షల సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. బీసీ కమిషన్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఐకమత్యంగా మంచిచేసే వారికి అండగా నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ బీసీలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించినట్లే టీడీపీ, జనసేన పార్టీలు అధిక సంఖ్యలో కేటాయించాలని జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, నర్సాపురం నియోజకవర్గ, మండలాధ్యక్షులు మల్లాడి వెంకటేశ్వర్లు, మోటుపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

హైదరాబాద్ శివారులో గుమ్మలూరు యువకుడి మృతి



కోన లోకేష్ (ఫైల్)

పోడూరు: గుమ్మలూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోన లోకేష్ (25) హైదరాబాద్‌లోని తన అక్క గృహప్రవేశ కార్యక్రమానికి గుమ్మలూరు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లాడు. మిగిలిన కుటుంబ సభ్యులు రైలులో వెళ్లారు. బైక్‌పై ప్రయాణం ప్రమాదకరమని కుటుంబసభ్యులు ఎంతచెప్పినా వినకుండా బయలుదేరాడు. లోకేష్ హైదరాబాద్ శివారులోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సెల్‌ఫోన్ ఆధారంగా అక్కడి పోలీసులు సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఈ ఘటనతో గుమ్మలూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. లోకేష్ తల్లిదండ్రులు లక్ష్మణరావు, దుర్గ. వీరికి ముగ్గురు సంతానం. వ్యవసాయమే జీవనాధారం. మృతుడు లోకేష్ గుమ్మలూరు గ్రామంలోనే ఉంటూ కోతమిషన్ ఆపరేటర్‌గా, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అన్నయ్య మహేష్ కూడా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.



కేపీ పాలెం బీచ్‌లో సేద తీరుతున్న సందర్శకులు

బీచ్‌లలో పర్యాటకుల సందడి

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు చాలా రోజులు తరువాత ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తీక మాసం తరువాత భారీ సంఖ్యలో పర్యాటకులు రావడం ఇదే మొదటి సారి. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు పర్యాటకులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు ఎండ వేడిమికి సముద్ర స్నానం చేస్తూ అలల మధ్య ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

కోడి పందేలపై దాడి

భీమవరం అర్బన్: నరసింహపురంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వీరి నుంచి ఒక కోడిపుంజు, రూ.1,150 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.రాజు తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం

ఉంగుటూరు: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే ట్రాక్‌మెన్‌గా పని చేసి రిటైర్ అయిన అంపా భాస్కరరావు (67) కాగుపాడులో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉంగుటూరు సమీపంలోని పొలానికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై నాచుగుంట పుంత రోడ్డు వద్ద నుంచి ప్రధాన రహదారిలోకి వస్తుండగా ఉంగుటూరు వైపు వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి భాస్కరరావును ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన అతనిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జగనన్న ఇళ్లు.. నెరవేరిన కలలు



దువ్వ గ్రామంలో సంచార జాతులకు వారికి ఆప్షన్ 3లో నిర్మించిన పక్కా గృహాలు



దువ్వ వయ్యేరు ఏటి గట్టు కింద సంచార జాతులు నివశించే గుడిసెలు(ఫైల్)

గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు

తణుకు టౌన్‌: ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న సంచార జాతులకు మోక్షం లభించింది. కాలనీ నిర్మించడంతో ఒక పక్కా గూడు దొరికింది. ముఖ్య మంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్న పథకాలు సంక్షేమ నవశ కానికి నాంది పలికాయి. సీఎం జగన్‌ చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నిలువ నీడ లేకుండా పేదలు పడుతున్న దుర్భర పరిస్థితులను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి రాగానే పేదలందరికీ పక్కా గృహాలు కట్టించి ఇస్తానని మాట ఇచ్చారు. మాట తప్పని, మడమ తిప్పని మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టి దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అంతటితో ఆగకుండా ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూ ర్చుతూ ఇళ్ల నిర్మించుకోవడానికి తోడ్పాటును అం దించారు. దీంతో పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుంచి నిరుపేదలకు ఉప శమనం లభించింది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవ డంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతు న్నాయి. వైఎస్సార్‌ జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకుంటున్నాయి. ఎటువంటి అభివృద్ధికి నోచుకొని అభాగ్యులకు రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ, అధికారుల సమయస్ఫూర్తితో ఎర్ర కాలువ, దువ్వ వయ్యేరు ఏటు గట్టు, గ్రామ పుంత రోడ్ల మార్జిన్‌లలో నివసించే సుమారు 50 సంచార జాతుల కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చారు. సొం తంగా ఇళ్లు నిర్మాణం చేసుకోలేని పరిస్థితిలో మం త్రి కారుమూరి, గ్రామ సర్పంచ్‌ అడ్డా బాబు ప్రత్యేక శ్రద్ధతో గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లలో స్థలాలు కేటాయించేలా చేశారు.

పేదలందరికీ పట్టాలిచ్చాం



తణుకు నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది ఇళ్లు లేని పేదలకు పార్టీలు, కుల, మతాలకు అతీతంగా నవ రత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చాం. దువ్వ, కోనాల గ్రామంలోని ఎర్ర కాలువ గట్టు, దువ్వ గ్రామం లోని వయ్యేరు ఏటి గట్టు ప్రాంతంలో నివాసం ఉం డే సంచార ప్రజలకు సొంతింటిని కల్పించడం సం తృప్తినిచ్చింది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి

జగనన్న ఇళ్లు గొప్ప వరం



పొలంలో ఎలుకలు పట్టి జీవిస్తూ దువ్వ వయ్యేరు ఏటు గట్టున గుడిసెల ఉండే మాకు ప్రభుత్వం సొం తంగా ఇంటి స్థలం అందించడం గొప్ప వరం. నేను ఆప్షన్ 3లో కాకుండా సొంతంగానే ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి సహాయం కూడా చేశారు.

– నంగళం శ్రీను, దువ్వ.

భయంతో వణికి పోయేవాళ్లం



దువ్వ వయ్యేరు ఏటు గట్టున గుడిసెలు వేసుకుని జీవించే వాళ్లం. ఏటా వర్షాకాలంలో వరదలకు మా ఇల్లు కూలిపోయేది. తర్వాత నెల రోజులకు గుడిసెలు వేసుకున్నా మళ్లీ వర్షాకాలంలో వరదలకు కూలిపోయేవి. గ్రామ సర్పంచ్‌ చొరవతో జగనన్న కాలనీలో సొంతింటిని పొందాం. చాలా ఆనందంగా ఉంది.

– గండికోట మంగమ్మ, దువ్వ.

సేవా భావంతో చేశాం



దువ్వ వయ్యేరు ఏటు గట్టున నివాసం ఉండే సంచార ప్రజలకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి నాయకులు, అధికారులు చాలా శ్రమ పడ్డాం. ముఖ్యంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్ 3లో ప్రత్యేక ఏజెన్సీని స్వయంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడి వారి స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించేలా కృషి చేశారు.

–పీ శ్రీనివాసరావు, మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి

వరదల నుంచి కాపాడాలని



ప్రతి సంవత్సరం వర్షా కాలంలో కురిసే భారీ వర్షాల, తుఫాన్‌లు, వరదల కారణంగా గ్రామంలోని వయ్యేరు ఏటు గట్టున నివాసించే వారి బాధలు చూడలేక వారికి సొంతంగా ఇళ్లు ఇవ్వాలనే మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఇక్కడ నివసించే వారందరనీ గుర్తించి వారికి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చాం.

– అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు), గ్రామ సర్పంచ్, దువ్వ

క్లుప్తంగా

గోపరాజు కళాప్రతిభ అభినందనీయం



కళాకృతులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాటి ఆకులపై కళాకృతులు భూపతిరాజు గోపరాజు కళా ప్రతిభ అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని సంతమార్కెట్‌లో జరిగిన కార్యక్రమంలో గోపరాజు తాటి ఆకులతో తయారు చేసిన శ్రీరాముడు, వెంకటేశ్వరస్వామి, గణపతి చిత్రాలను, దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రాలను పలువురు నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరిశే సోమేశ్వరరావు, పసుపులేటి రామారావు, నరసింహమూర్తి, బులిరాజు తదతరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పెంటపాడు: ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో జరిగే పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వల్లూరుపల్లిలో గ్రామ సచివాలయం, ఆర్బీకే సెంటర్, కె. పెంటపాడులో ఆర్బీకే సెంటర్, అకుతీగపాడులో ఆర్బీకే సెంటర్, సచివాలయం, కోరిమిల్లి, చింతపల్లి, అలంపురం గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లతో పాటు, పలు గ్రామాల్లో రహదార్ల ప్రారంభోత్సవాలు చేస్తారని కైగాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



శశిలో జరిగిన కాన్ఫరెన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలోని శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో సామాజిక, స్థిరమైన ఆవిష్కరణలపై 2024 ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ మూడు రోజుల సదస్సు ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా ఐఈఈఈ సభ్యులు, జియోగ్రాఫిక్ యాక్టివిటీస్ ఉపాధ్యక్షుడు దీపక్‌ముదుర్ మాట్లాడుతూ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొనడం వల్ల అనేక సాంకేతిక విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. జార్జియా స్టేట్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధా మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సోషల్ మీడియా వినియోగంపై అనేక ఆస్తికరమైన విషయాలు తెలిపారు. సీనియర్ మెషిన్ ఇంజనీర్ డాక్టర్ ఎస్.సుందర్శన మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలో హార్డ్‌వేర్ టెక్నాలజీ ఆవిష్కరణలపై కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ శ్రీ లక్ష్మి ఎలక్ట్రికల్ , డాక్టర్ ప్రీనగార్, డాక్టర్ బి.చిట్టిబాబు, డాక్టర్ సీహెచ్ అనిల్, డాక్టర్ వి.సందీప్‌లు మాట్లాడారు. ఉత్తమ రీసెర్చ్ ప్రాజెక్టులను ఎంపిక చేసిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

సోమేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే విష్ణు



విద్యాగణపతి స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక సోమేశ్వర స్వామి వారిని, విద్య గణపతి స్వామిని విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి

ఉండి: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ వద్ద, ఉండి బస్టాండ్ సమీపంలోను ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మిరియాల రవిబాబు కళాజాత బృందం ప్రదర్శనలిచ్చారు.ఈ సందర్భంగా వారు ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

నేడు రైతు, కార్మిక నిరసన ప్రదర్శన

భీమవరం: వ్యవసాయ రంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు సోమవారం నిరసన ప్రదర్శన చేయనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సీఐటీయూ స్థానిక కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, ఆకుల హరేరామ్ మాట్లాడారు.

ముస్లిం, మైనార్టీలను తెలుగుదేశం విస్మరించింది



ఎస్కె నౌషాద్ మొహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగుదేశం పార్టీ ఇటీవల ప్రకటించిన 94 స్థానాలలో ముస్లిం మైనార్టీలను, బీసీ వర్గాలను విస్మరించిందని, తీరని అన్యాయం చేశారని, ముస్లింలను చిన్నచూపు చూడటం తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కె నౌషాద్ మొహిద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీలకు ఒకే ఒక్క సీటు కేటాయించడం దారుణమని, ముస్లిం, మైనార్టీల పట్ల చిన్నచూపును ప్రదర్శించడం తగదన్నారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి బీజేపీ నాయకులు కాళ్లు పట్టుకొని వచ్చే అంసెబ్లీ ఎలక్షన్‌ల్లో ఏదో రకంగా అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి చంద్రబాబు పడరాని పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. మొదటి నుంచి ముస్లిం మైనార్టీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించారని, చట్ట సభల్లో గాని, నామినేటెడ్ పదవులుగాని, మంత్రి పదవులుగాని మైనార్టీ వర్గాలకు టీడీపీ హయాంలో న్యాయం జరగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలు పక్షపాతిగా ఉన్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం తథ్యమన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



తూర్పువిప్పర్రులో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని తూర్పువిప్పర్రు గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ సజ్జాపురం, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అడ్డగర్ల అమ్మిరాజు జ్ఞాపకార్థం వారి కుమారులు అడ్డగర్ల వెంకటేశ్వర రావు బ్రదర్స్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ సజ్జాపురం ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సుంకవల్లి నీలు మహేంద్రలు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. 209 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాబు ప్రసాద్, సెక్రటరీ అడ్డగర్ల వెంకటేశ్వరరావు, బైలా లక్ష్మీనారాయణ, కరుణాకర్ చౌదరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజలు

ఆకివీడు: అభివృద్ధి పనుల కోసం కొబ్బరికాయ కొట్టిన నెల రోజుల్లోనే పనిని బట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుని భూమి పూజ చేస్తున్నానని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోనూ, స్థానిక పట్టణంలోనూ ఆదివారం విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి, టెండర్లు పూర్తి చేసి, వర్కు ఆర్డర్ వచ్చిన తరువాత భూమి పూజ చేసి కొబ్బరికాయ కొడుతున్నాని చెప్పారు. నియోజకవర్గంలో గత 58 నెలల నుంచి తాను కొబ్బరికాయ కొట్టిన పని ఒక్కటీ ఆగలేదన్నారు. పకడ్బందీగా పనులు నిర్వహించడం వల్లే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో చినకాపవరం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి రూ. 60 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. దీనిలో రూ.25 లక్షలు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు ఇచ్చారని నర్సింహరాజు తెలిపారు. గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీపీ నిధులు రూ. 16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో రూ.3.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 12వ వార్డులో రూ. 6.25 లక్షలతో సీసీ రోడ్లు, 15వ వార్డులో రూ. 4 లక్షలతో సీసీ డ్రెయిన్, 16వ వార్డులో రూ. 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, 18వ వార్డులో రూ. 7.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆయన వివరించారు. పట్టణంలో మొత్తం రూ. 29.42 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నర్సింహరాజు చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరి కాయలు కొడుతున్నారనే అనుమానాలు వద్దని, భూమి పూజ చేసిన పనులన్నింటిని నెలలో పూర్తి చేస్తారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల కిషోర్ రెడ్డి, భీమవరం ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ ఎస్కె రసూల్‌బీబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూపు -2 పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రూరల్, పట్టణంలోని ఏడు సెంటర్లలో ఆదివారం గ్రూపు-2 పరీక్షలు నిర్వహించారు. మండలంలో పెదతాడేపల్లి, పట్టణంలోని ఆదిత్య జూనియర్‌కళాశాల, శశి ఇంజనీరింగ్, వాసవి డిగ్రీ కళాశాల, శశి జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, శ్రీవాసవి గ్రంధి మాణిక్యాలరావు జూనియర్ కళాశాలల్లో మొత్తం 3,368మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, 2805మంది హాజరయ్యారు. మరో 563మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని తహసీల్దార్ బి.మురళీకృష్ణ తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్షలు

తణుకు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూపు- 2 పరీక్షలకు ఆదివారం తణుకు పట్టణంలోని వివిధ కేంద్రాల్లో నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకూ ఈపరీక్షలను నిర్వహించారు. తణుకు పట్టణంలోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, బాలుర ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్, శశి స్కూల్ తదితర విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. తణుకు పట్టణంలోని ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,998 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఇతర మండలాలకు చెందిన ఎంపీడీవోలు, అధికారులు, వివిధ కళాశాల సిబ్బంది పర్యవేక్షించారు.

28న కొండ్రుప్రోలులో విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు మంచినీటి చెరువు వద్ద నిర్మించిన ఆలయంలో ఐశ్వర్య గణపతి విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 28వ తేది ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించి, తరలించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఆరవల్లి, మంచిలి రైల్వే అండర్‌పాస్‌లు ప్రారంభం

అత్తిలి: కేంద్ర ప్రభుత్వ అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి, మంచిలి గ్రామాల్లో గల రైల్వే అంగర్‌పాస్‌లను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం ఉదయం 10గంటలకు వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. ఆరవల్లి, మంచిలి రైల్వే అంగర్‌పాస్‌ల వద్ద రైల్వే అధికారులు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారని, ఈకార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన కోరారు.


మానవత ద్వారానే మెరుగైన సమాజం



మానవత సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు, ఎంఈవో టీవీ రామకృష్ణ

పెంటపాడు: మానవత ద్వారానే మెరుగైన సమాజం సాధ్యమని మానవత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడులోని మండల మానవత సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్, మానవత ఈసీ సభ్యులు గంపా కృష్ణమోహన్ ఆత్మ కుశాంతి కలగాలని కోరుతూ చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఫ్రీజర్లు, శాంతి రథాల నిర్వహణ, వ్యక్తిత్వ వికాసశిక్షణా తరగతుల నిర్వహణ, సామజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌కు, ప్రభుత్వ పాఠశాలకు ప్యాన్‌ల బహుకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు మండల మానవత సభ్యులు కృషి చేయడం అభినందనీయమన్నారు. సభ్యులు తారాడి పోల్, ఏలూరి వీరాస్వామి, సత్తారు రాము, కృపావరం, ప్రభువరం, మానుకొండ సునీల్, దావీదు, జయరాజు, కేశవరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రప్రదర్శన



కళాకారుడు గీసిన చిత్రం

భీమవరం: స్థానిక మారుతి టాకీస్ సెంటర్లో ఉన్న అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన చిత్ర కళా సంబరం ఆర్టిస్ట్ వర్క్‌షాప్ సందర్శకులను ఆకట్టుకుంది. ఉభయ రాష్ట్రాల నుంచి 95 మంది చిత్రకారులు హాజరై లైవ్‌లో చిత్రాలను గీశారు. అకాడమీలోనే అప్పటికప్పుడు వేసి, తరువాత పోటీకి ప్రదర్శనకు ఉంచారు. ఇందులో భీమవరం ముఖ చిత్రం, ఆక్వా రాజధాని, పంచారామ క్షేత్రం, కోడి పందేలు, ఎల్లాప్రగడ సుబ్బారావు, మావుళ్లవార్ని ఆరాధించటం, మగువ అందమైన చూపులు, కౌమార దశ బాలిక ఆహార్యం, పల్లెటూరి వాతావరణం, గోదావరి తీరం, పంచారామ క్షేత్రమహాశివుడి ఆహార్యం, ప్రకృతి తదితర చిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. వర్క్ షాప్‌ను వదరాజు ముత్తరాజు ఆనంద్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని కళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. కళలకు పుట్టినిల్లు పశ్చిమగోదావరి జిల్లా అని కళకారులు పేర్కొన్నారు. దాతల సహకారంతో భవనాన్ని నిర్మించారని, ప్రతి ఆదివారం ఉచితంగా చిన్నారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, కాగిత వెంకటరమణ, గ్రంధి వెంకట్రావు, గోపా సత్యనారాయణ, అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి వెంకటరావు, కోశాధికారి గోపా సత్యనారాయణ, నల్లం వీరాస్వామి, డీవీఎస్ చంద్ర జి, రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయం

కాళ్ల: దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో వృద్ధులకు వికలాంగులకు ఇంటింటా ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేసేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. నిరుపేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వికలాంగునికి ట్రై సైకిల్ ను వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం గ్రామంలో పలువురు పెద్దలు వేగేశ్న సుబ్బరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజులను సన్మానించారు. ప్రముఖ వైద్యు నిపుణులు డాక్టర్ నీలాద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ఆరోగ్యానికి భరోసా

- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యసేవలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



అత్తిలి మండలం బల్లిపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అత్తిలి: గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణలకు వెళ్లాల్సిన దుస్థితి. ఆర్థిక స్థోమత లేనివారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమతమయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్షలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 104,108 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు చికిత్సలు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రస్తుతం హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మిగిలిన చోట్ల అందుబాటులో ఉన్న భవనాల్లోనే వైద్య సేవలు అందజేస్తున్నారు.

2500మందికి ఒక సెంటర్

ప్రతి 2500మంది జనాభాకు ఒక హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉండి సేవలందిస్తారు.

ఇంటి వద్దకే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యం అందజేస్తున్నారు. ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు వైద్యులు, సిబ్బంది సందర్శించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపి చూస్తున్నారు. ఆ తర్వాత మంచంపై ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్న ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రతి గ్రామానికి రెండుసార్లు 104 వాహనంతో వెళ్తున్నాం. ఉదయంనుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటివద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 68రకాల మందులు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో అందబాటులో ఉంటున్నాయి. రోజు అన్ని హెల్త్‌క్లినిక్‌లనుంచి సమాచారం తీసుకుంటున్నాం. గ్రామీణప్రజలకు మెరుగైనవైద్యం అందజేస్తున్నాం.

– డాక్టర్ కె నాగరాజు, వైద్యాధికారి, అత్తిలి పీహెచ్‌సీ

గ్రామంలోనే వైద్యసేవలు



మాగ్రామంలో ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. దీంతో మాకు ఏ అత్యవసర వైద్యం, సమస్యలు వచ్చినా హెల్త్ క్లినిక్‌లోనే వైద్య సిబ్బంది వెంటనే సేవలు అందజేస్తున్నారు. అంతేకాకుండా ప్రతినెలా రెండుసార్లు 104వాహనం ద్వారా వైద్యులు గ్రామంలోకి వస్తున్నారు. అక్కడే రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసరం అయి నప్పుడు 108వాహనంలో పట్టణాలకు తీసుకువెళ్తున్నారు.

– కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ, సర్పంచ్, బల్లిపాడు,అత్తిలి మండలం

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

భీమవరం అర్బన్: కంటి సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు అన్నారు. భీమవరం మండలం గూట్లపాడు గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లకు వ్యాధులు సోకితే వెంటనే వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలని లేకుంటే అంధత్వం ఆవహిస్తుందని వెంకటపతిరాజు హెచ్చరించారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, పలువురికి ఉచితంగా మందులు, కళ్ల జోళ్ల అందజేశామని, 10 మందికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం రాజమండ్రిలోని వేమగిరిలో పరమహంస యోగానంద నేత్రాలయకు సిఫారసు చేశామని సంస్థ డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నరసింహమూర్తి (చినబాబు), సర్పంచ్ ఒడుగు ముత్యాలరాజు, కొప్పినీడి ఆదినారాయణ, తిరుమాని నాగరాజు, వడ్డి వెంకటేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, చెలంకూరి శివహనుమాన్ ప్రసాద్, జవ్వాది గణేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.